సాక్షి
వైఎస్సార్ జిల్లా
గురువారం । 12 । అక్టోబర్ । 2023



పరీక్షా ఫలితాల విడుదల

కడపలోని డాక్టర్ వైఎస్సార్ ఆర్కిటెక్చర్ అండ్ ఫైన్ ఆర్ట్స్ విశ్వవిద్యాలయంలో ఎం.ప్లాన్ (యూఆర్పీ) విభాగం 4వ సెమిస్టర్ పరీక్షా ఫలితాలు బుధవారం విడుదల చేశారు. -8లో



రాణించిన కడప బ్యాట్స్‌మన్

కడప కేఎస్ఆర్ఎం మైదానంలో కర్నూలు జట్టుతో జరిగిన అంతర్ జిల్లాల మల్టీడేస్ క్రికెట్ టోర్నమెంట్‌లో కడప క్రీడాకారులు రాణించారు. -8లో

గరిష్టం/కనిష్టం
36.3/25.2

వాతావరణం

జిల్లాలో బుధవారం 25.2 – 36.3 డిగ్రీల మధ్య ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. గంటకు 5.0 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచాయి.
- కడప అగ్రికల్చర్

న్యూస్‌రీల్

సోమశిల ముంపు బాధితులకు అవకాశం

కడప సిటీ: సోమశిల ప్రాజెక్టు కింద ఆస్తులు ముంపునకు గురై లేదా భూ సేకరణ అవార్డు పొందిన వారు ఉద్యోగ కల్పనకు ఈ నెల 16వ తేదీలోగా వివరాలు తెలియజేయాలని సోమశిల ప్రాజెక్టు పర్యవేక్షక ఇంజినీరు బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. జీఓ 98 ప్రకారం 15.4.1986 కంటే ముందు దరఖాస్తు చేసుకోలేని వారు వివరాలు సంబంధిత కార్యాలయంలో అందజేయాలన్నారు. గతంలో దరఖాస్తు చేసి ఉండి తిరస్కరణకు గురై ఉంటే తగిన ఆధారాలతో మళ్లీ వివరాలు ఇవ్వాలని తెలిపారు. వాటిని పరిశీలించి క్వాలిఫైడ్ అభ్యర్థుల జాబితా రూపొందిస్తామని ఆయన తెలిపారు.

బాస్కెట్‌బాల్ సెలక్షన్ కమిటీ సభ్యుడిగా శ్రీనివాసులురెడ్డి


శ్రీనివాసులురెడ్డి

కడప స్పోర్ట్స్: రాష్ట్ర స్థాయి బాస్కెట్‌బాల్ అకాడమీలో ప్రవేశాలకు నిర్వహించే ఎంపిక కమిటీ సభ్యుడిగా కడపకు చెందిన వ్యాయామ ఉపాధ్యాయుడు సి.శ్రీనివాసులురెడ్డిని నియమించారు. పులివెందుల పట్టణంలోని ఇంటిగ్రేటెడ్ స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లోని ఈ నెల 10 నుంచి 12వ తేదీ వరకు నిర్వహిస్తున్న ఈ ఎంపికల్లో ఈయన సభ్యుడిగా వ్యవహరిస్తారు. ఈయన కడప నగరంలోని మున్సిపల్ హైస్కూల్ (మెయిన్)లో ఫిజికల్ డైరెక్టర్‌గా పనిచేస్తున్నారు.

హార్టికల్చర్ కళాశాలలో అడ్మిషన్లు ప్రారంభం


దరఖాస్తులు స్వీకరిస్తున్న అధికారులు

పులివెందుల రూరల్: పట్టణంలోని హార్టికల్చర్ కళాశాలలో అడ్మిషన్లు ప్రారంభమైనట్లు సీనియర్ శాస్త్రవేత్త సునీత తెలిపారు. ఈ నెల 5వ తేదీ నుంచి 9వ తేదీ వరకు హార్టికల్చర్ బీఎస్సీలో చేరేందుకు రాయలసీమలోని వివిధ జిల్లాల నుంచి విద్యార్థులు దరఖాస్తు చేసుకున్నారని తెలిపారు. వీరిలో అర్హులకు బుధవారం అడ్మిషన్ ఇచ్చామని తెలిపారు.

98 శాతం ఈకేవైసీ పూర్తి

కడప అగ్రికల్చర్: జిల్లా వ్యాప్తంగా ఖరీఫ్‌లో సాగైన వ్యవసాయ, ఉద్యోగ పంటలకు సంబంధించి ఈ క్రాప్ నమోదుకు గడువు ముగిసింది. ఈ నెల 10వ తేదీ నాటికి జిల్లాలో 303545 ఎకరాల్లో ఈ క్రాప్ నమోదు అధికారులు పూర్తి చేశారు. 302986 ఎకరాలు లక్ష్యం కాగా, 297420 ఎకరాల్లో ఈకేవైసీ పూర్తయింది. ఈ క్రాప్ వంద శాతం, ఈకేవైసీ 98 శాతం పూర్తి చేసినట్లు అధికారులు తెలిపారు.

రాష్ట్ర జట్టుకు ఎంపిక


క్రీడాకారులతో మాట్లాడుతున్న సాయిగ్రేస్

పులివెందుల టౌన్: పులివెందుల అకాడమీలో రాష్ట్ర స్థాయి హాకీ, వాలీబాల్, బాస్కెట్‌బాల్, బ్యాడ్మింటన్, టెన్నిస్ జట్టుకు క్రీడాకారుల ఎంపిక బుధవారం జరిగింది. స్థానిక వైఎస్సార్ స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో కడప స్టెప్ సీఈఓ సాయిగ్రేస్, కన్వీనర్ సురేంద్రబాబు, శాప్ హెడ్ ఆఫీస్ స్పోర్ట్స్ అథారిటీ సీనియర్‌లు కోచ్ మహేష్(హాకీ), కోటేశ్వరరావు(వాలీబాల్), శ్రీనివాసరావు (బాస్కెట్‌బాల్), భాస్కర్ (బ్యాడ్మింటన్) ఈ ఎంపికలు నిర్వహించారు. కడప, నంద్యాల, అనంతపురం, తిరుపతి తదితర జిల్లాల నుంచి ఐదు క్రీడాంశాలకు సంబంధించిన క్రీడాకారులు పాల్గొన్నారు.

ఈ–శ్రమ్ కార్మికులకు వరం


శ్రీకాంత్‌నాయక్, కమిషనర్

కడపకోటిరెడ్డిసర్కిల్: ఈ–శ్రమ్ పోర్టల్‌లో నమోదైన అసంఘటిత, వలస కార్మికులకు పలు ప్రయోజనాలు కల్పిస్తున్నామని జిల్లా కార్మిక శాఖ సహాయ కమిషనర్ శ్రీకాంత్‌నాయక్ తెలిపారు. ఆయన మాట్లాడుతూ అసంఘటిత రంగ, వలస కార్మికులు, వ్యవసాయ కూలీలు, చేతి వృత్తి పనివారు, వీధి వ్యాపారులు, ఆశా, అంగన్వాడీ వర్కర్లు, మత్స్యకారులు, కూలీలు, 16–59 సంవత్సరాల మధ్య వయస్సు ఉంటే ఈశ్రమ్ కార్డుకు నమోదు చేసుకోవాలన్నారు. వారికి ప్రధానమంత్రి సురక్ష బీమా యోజన కింద బీమాకు ప్రీమియం చెల్లించాల్సిన అవసరం లేదన్నారు. నమోదైన కార్మికులు ప్రమాదవశాత్తూ మరణించినా, అంగవైకల్యం పొందినా ఎక్స్‌గ్రేషియా సొమ్ము అందజేస్తారన్నారు.

ప్రజల మాట.. ప్రగతి బాట



ఈ ఫొటోలో విద్యార్థినులు బ్రహ్మంగారిమఠం పలుగురాళ్లపల్లె హైస్కూల్‌లో చదువుతున్నారు. జగనన్న గోరుముద్ద పథకం కింద రుచికరమైన భోజనం అందుతోంది. అయితే కూర్చునేందుకు వసతి లేకపోవడంతో చెట్ల కింద, ఆరుబయట భోజనాలు చేస్తూ వచ్చారు. దీంతో శునకాల బెడద, చెట్లపై నుంచి ఆకులు రాలడం సమస్యలు ఎదురయ్యాయి. ఊరి పెద్దలు నిర్ణయం తీసుకుని రూ.7.81 లక్షలతో సౌకర్యవంతమైన డైనింగ్ హాల్ నిర్మించారు. విద్యార్థినులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

- జిల్లాలోని 7 పంచాయతీల్లో అభివృద్ధి పనులు
- వాటర్‌షెడ్ కమిటీ తీర్మానంతో పరిపాలనా అనుమతి
- గ్రామస్థుల వాటాగా 20 శాతం నిధుల సేకరణ



తొండూరు మండలం సంతకొవ్వూరులో ఏర్పాటు చేసిన నీటి తొట్టెలు

కడప సిటీ: ప్రజలను స్వచ్ఛందంగా భాగస్వాములను చేయడంతో గ్రామాలు అభివృద్ధి వైపు నడుస్తున్నాయి. గ్రామం లేదా సమూహంగా ఏర్పడి చర్చించుకుంటూ తీర్మానాలు చేసి అవసరమయ్యే పనులు చేపడుతున్నారు. ప్రభుత్వం వాటర్‌షెడ్ కింద చేపట్టిన ప్రవేశిక కార్యక్రమంతో నిధుల సాయం చేయడంతో పల్లెలు ప్రగతి బాటలో నడుస్తున్నాయి.

- జిల్లా వ్యాప్తంగా తొమ్మిది మండలాల పరిధిలోని 37 పంచాయతీల్లో వాటర్‌షెడ్ పథకంలో భాగంగా ప్రవేశిక కార్యక్రమం (ఎంట్రీ పాయింట్ యాక్టివిటీ) కింద పనులు చేపడుతున్నారు. ఇందుకోసం ప్రభుత్వం రూ.1.55 కోట్లు ఖర్చు చేసింది. గ్రామంలోని ప్రజలందరినీ భాగస్వామ్యం చేసి గ్రామం లేదా సమూహానికి అవసరమయ్యే పనులు గుర్తించి తీర్మానం చేశారు. వాటిలో పశువుల సంక్షేమం కోసం పశు వైద్య శిబిరాలు, తాగునీటి తొట్టెలు, బోర్లు ఏర్పాటుచేసుకున్నారు. పాఠశాలల్లో మధ్యాహ్న భోజన శాలలు (డైనింగ్ హాలు), నీటి సరఫరా పైపులైన్లు, సోలార్ విద్యుద్దీపాలు, రచ్చబండలు, సచివాలయాలు, దేవాలయాలు, ఆటో స్టాండ్లు, కూడళ్లు, ప్రజలు కూర్చునేందుకు వీలుగా సిమెంటు బల్లలు ఏర్పాటుచేసుకున్నారు.

ప్రజల భాగస్వామ్యంతో...

ప్రవేశిక కార్యక్రమం ద్వారా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వివిధ అభివృద్ధి పనులకు 60: 30 శాతం నిధులు కేటాయిస్తాయి. ప్రజలను భాగస్వామ్యం చేయాలనే ఉద్దేశ్యంతో 20 శాతం లబ్ధిదారుల వాటాను సేకరించి వాటర్‌షెడ్ అభివృద్ధి నిధి పేరుతో జమ చేస్తారు. చేపట్టిన అభివృద్ధి పనులకు మరమ్మత్తులు అవసరమైతే ఈ నిధులు వాడుకునేందుకు వీలు కల్పించారు.

గ్రామ సభల ద్వారా

ఈ కార్యక్రమం కింద చేపట్టే పనులన్నింటిపై గ్రామ ప్రజలతో చర్చించడం, వాటర్‌షెడ్ కింద చేయదగిన పనులను గుర్తించి కమిటీ సభ్యుల తీర్మానంతో పరిపాలనా అనుమతులు పొందడం ప్రారంభంలో జరుగుతుంది. అనంతరం పనులు ప్రారంభిస్తారు. అన్ని రకాల పనులపై సామాజిక తనిఖీ కూడా ఉంటుంది. నాణ్యతా ప్రమాణాలకు తిలోదకాలిచ్చేందుకు అవకాశాలు ఉండవు. లింగాల, బి.మఠం మండలంలోని ఉన్నత పాఠశాలల్లో విద్యార్థులకు భోజనశాలలు నిర్మించారు. ప్రజల దాహార్తి తీర్చేందుకు పైపులైన్ పనులు, సౌర విద్యుద్దీపాలు ఏర్పాటు చేసుకున్నారు. ప్రజలంతా గ్రామ ఆస్తిగా పరిగణించి సంరక్షించుకుంటారు.

తాగునీటి సమస్య తీరింది



గ్రామంలోని హరిజనవాడ కాలనీ వాసులు దూర ప్రాంతాలకు వెళ్లి తాగునీరు తెచ్చుకునే వారు. అవీ పరిశుభ్రంగా ఉండేవి కావు. వారు పడుతున్న ఇబ్బందులను చూసి వాటర్ షెడ్ కింద రూ. 6.19 లక్షలతో పెన్నానదిలో బోరువేసి 1700 మీటర్ల పైపులైన్ నిర్మించాం. నీటిని మళ్లించి కొళాయిలు బిగించడంతో నీటి సమస్య తీరిపోయింది. ప్రజలు రూ.70 వేలు తమ వాటాగా ఇచ్చారు.
– జి.లక్ష్మిరెడ్డి, వాటర్‌షెడ్ చైర్మన్, జ్యోతి గ్రామం, సిద్దవటం మండలం

ప్రతి పనికి తనిఖీ తప్పనిసరి



వాటర్‌షెడ్ కింద ప్రవేశిక కార్యక్రమంలో చేపట్టిన అన్ని పనులకు సామాజిక తనిఖీ తప్పనిసరిగా ఉంటుంది. ఎక్కడా నాణ్యతా ప్రమాణాలపై రాజీ లేకుండా పనులు చేపడతాం. ప్రజల నుంచి మంచి స్పందన వచ్చింది. వివిధ అభివృద్ధి పనులకు అవకాశం ఉన్నందువల్ల ఈ కార్యక్రమం గ్రామాభివృద్ధికి మరింత దోహదపడుతుంది.
– యదుభూషణరెడ్డి, డ్వామా పీడీ, కడప

ప్రజారోగ్యమే ప్రభుత్వ లక్ష్యం

- జిల్లాలో 28 ప్రాంతాల్లో వైద్య శిబిరాలు

కడప రూరల్: ప్రభుత్వం చేపడుతున్న జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాలకు పెద్ద ఎత్తున ఆదరణ లభిస్తోంది. ప్రజారోగ్యమే లక్ష్యంగా ప్రభుత్వం పెద్ద ఎత్తున మెడికల్ క్యాంపులు నిర్వహిస్తోంది. ఉచిత వైద్య సేవలను జనం సద్వినియోగం చేసుకుంటున్నారు. జిల్లా వ్యాప్తంగా 28 కేంద్రాల్లో శిబిరాలు ఏర్పాటు చేశారు. కడప నగరం కట్టకింద హరిజనవాడలో నిర్వహించిన మెడికల్ క్యాంపులో డిప్యూటీ సీఎం అంజద్‌బాషా, కార్పొరేటర్లు పాల్గొన్నారు. అట్లూరు మండలం కొండూరు సచివాలయం పరిధిలో జరిగిన శిబిరంలో ఎమ్మెల్యే డాక్టర్ సుధ, ఎర్రగుంట్ల మండలం కలమల్లలో ఎమ్మెల్యే డాక్టర్ సుధీర్‌రెడ్డి, బద్వేలు మండలం పుట్టాయపల్లెలో ఎమ్మెల్సీ గోవిందరెడ్డి, ఎమ్మెల్యే డాక్టర్ సుధ, ఆయా ప్రాంతాల్లో జరిగిన కార్యక్రమాల్లో స్థానిక ప్రజా ప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

డ్రగ్ రహిత ఆంధ్రప్రదేశ్‌ను నిర్మిద్దాం


సమావేశంలో మాట్లాడుతున్న ఏపీ జాయింట్ కమిషనర్ నాగలక్ష్మి

పులివెందుల టౌన్: డ్రగ్ రహిత సమాజం కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఎన్‌ఫోర్స్‌మెంట్ ఏపీ జాయింట్ కమిషనర్ నాగలక్ష్మి పేర్కొన్నారు. స్థానిక లయోలా డిగ్రీ కళాశాలలో జరిగిన కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ మాదకద్రవ్యాల మీద విద్యార్థులు అవగాహన కలిగి ఉండాలన్నారు. మాదకద్రవ్యాలు సరఫరా చేసే ముఠాలకు ఆకర్షితులై ఎంతో మంది విద్యార్థులు తమ భవిష్యత్తు నాశనం చేసుకుంటున్నారన్నారు. వాటిపై మక్కువ చూపకుండా తల్లిదండ్రుల కలలు సాకారం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో కడప ఎన్‌ఫోర్స్‌మెంట్ సూపరింటెండెంట్ శ్రీనివాసులు, సీఐ రామాంజనేయులు, కళాశాల ప్రిన్సిపల్ అమల్‌రాజ్ పాల్గొన్నారు.

రోగులకు నిరంతరం వైద్యసేవలు

కమిషనర్ జి.సూర్యసాయి ప్రవీణ్ చంద్


సిబ్బందికి సూచనలిస్తున్న కమిషనర్

కడప అర్బన్: ప్రభుత్వ సర్వజన ఆసుపత్రిలో రోగులకు నిరంతరం వైద్య సేవలందేలా చూడాలని కడప నగరపాలక సంస్థ కమిషనర్, జి.సూర్యసాయి ప్రవీణ్ చంద్ ఆదేశించారు. కడప ప్రభుత్వ సర్వజన ఆసుపత్రిలో(రిమ్స్) ప్రతి వార్డును ఆయన రిమ్స్ అధికారులతో కలిసి పరిశీలించారు. ఆకస్మిక తనిఖీలు నిర్వహించి రోగులతో మాట్లాడారు. వైద్య సిబ్బంది పనితీరును అడిగి తెలుసుకున్నారు. బాత్‌రూమ్‌లు, నీటి పైపులైన్లు, ఇతర మరమ్మతులకు మంజూరైన రూ.1.40 కోట్లు వినియోగించుకోవాలని సూచించారు. కొన్ని వార్డుల్లో హౌస్ సర్జన్లు, పీజీలు వైద్య సేవలందిస్తున్నారని గమనించి సూచనలు చేశారు. నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో రెండు లక్షల గ్యాలన్ల రక్షిత నీరు సరఫరా అయ్యేలా చూడాలని మున్సిపల్ అధికారులకు ఆయన సూచించారు. వైద్య సిబ్బంది, రోగులకు అందించే పౌష్టికాహారం తయారీ విధానాన్ని ఆయన పరిశీలించారు. 200 పడకలు గర్భిణులకు కేటాయించాలని సూచించారు. పరికరాలకు మరమ్మతు చేయించాలని, వృథాగా పడేయరాదన్నారు. ఈ కార్యక్రమంలో సూపరింటెండెంట్ డాక్టర్ రమాదేవి, డాక్టర్ ఎం.సురేశ్వర్‌రెడ్డి, ఆర్ఎంఓలు డాక్టర్ వై.శ్రీనివాసులు, డాక్టర్ రాజేశ్వరి, డాక్టర్ శ్రీధర్, డాక్టర్ అమర్‌నాథ్‌రెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

రౌడీషీటర్ల కేసులపై ఎస్పీ సమీక్ష



మాట్లాడుతున్న జిల్లా ఎస్పీ సిద్ధార్థ్ కౌశల్

కడప అర్బన్: రౌడీ షీటర్లపై కోర్టుల్లో వున్న కేసుల పురోగతిని జిల్లా ఎస్పీ సిద్ధార్థ్ కౌశల్ పోలీసు అధికారులతో బుధవారం సమీక్షించారు. నగరంలోని జిల్లా పోలీస్ కార్యాలయం వద్ద వున్న 'పెన్నార్' పోలీస్ కాన్ఫరెన్స్ హాల్‌లో జరిగిన సమావేశంలో ఎస్పీ మాట్లాడుతూ రౌడీషీటర్లపై కోర్టుల్లో వున్న కేసుల్లో త్వరితగతిన ట్రయల్ పూర్తిచేసి శిక్షపడేలా చేయాలన్నారు. పెండింగ్ కేసులను త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు. 2019 ఎన్నికల సందర్భంగా జరిగిన ఘటనలు తెలుసుకుని సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ(అడ్మిన్) తుషార్ డూడీ, ప్రొద్దుటూరు ఏఎస్పీ ప్రేర్ణాకుమార్, జిల్లాలోని డీఎస్పీలు, సీఐలు పాల్గొన్నారు.

అరుణాచలానికి ప్రత్యేక బస్సులు



కడప కోటిరెడ్డిసర్కిల్: కడప రీజియన్ పరిధి నుంచి తమిళనాడు రాష్ట్రంలోని అరుణాచల క్షేత్రానికి ప్రత్యేక బస్సులు నడుపుతున్నట్లు ప్రజా రవాణాధికారి పోలిమేర గోపాల్‌రెడ్డి తెలిపారు. జమ్మలమడుగు డిపో నుంచి ఉదయం ఏడు గంటలకు ప్రొద్దుటూరు, మైదుకూరు, కడప మీదుగా బస్సు నడుపుతామని రూ.1557 ఛార్జీగా నిర్ణయించామని తెలిపారు. మైదుకూరు నుంచి పోరుమామిళ్ల, మైదుకూరు, కాణిపాకం, గోల్డెన్ టెంపుల్ మీదుగా సాయంత్రం 6 గంటలకు బస్సు నడుపుతున్నామని, రూ.1414 టిక్కెట్ నిర్ణయించామన్నారు. బద్వేల్ డిపో నుంచి ఉదయం 5.30 గంటలకు బస్సు బయలుదేరి పోరుమామిళ్ల, పెంచలకోన, శ్రీకాళహస్తి, గోల్డెన్ టెంపుల్, కాణిపాకం మీదుగా వెళ్తుందని, అల్ట్రా డీలక్స్‌లో రూ.1566, సూపర్ లగ్జరీలో రూ. 1475 ఛార్జీ ఉంటుందన్నారు. పులివెందుల డిపో నుంచి కంచి మీదుగా తిరుమన్నామలైకు రాత్రి ఎనిమిది గంటలకు బస్సు వెళుతుందని, రూ.1242 టిక్కెట్ ధర ఉంటుందన్నారు. ప్రొద్దుటూరు డిపో నుంచి రాత్రి 9 గంటలకు వెళ్లే బస్సుకు రూ.1273 ధర నిర్ణయించారన్నారు. కడప నుంచి రాత్రి 9 గంటలకు బస్సు వెళ్తుందని టిక్కెట్ రూ. 1072గా ఉంటుందన్నారు.

ప్రజల సమస్యలకు సత్వరమే పరిష్కారం

కలెక్టర్ విజయరామరాజు


వల్లూరు వాసుల సమస్యలు తెలుసుకుంటున్న కలెక్టర్ విజయరామరాజు

వల్లూరు: ప్రజల వినతులకు సత్వరమే పరిష్కారం చూపాలని కలెక్టర్ విజయరామరాజు అధికారులకు సూచించారు. వల్లూరు మండల కార్యాలయం వద్ద బుధవారం జగనన్నకు చెబుదాం కార్యక్రమాన్ని నిర్వహించారు. వివిధ గ్రామాల నుంచి వచ్చిన వారితో వినతులు స్వీకరించిన కలెక్టర్ వివరాలు అడిగి తెలుసుకున్నారు. క్షేత్ర స్థాయిలో పరిశీలించి న్యాయం చేయాలని సంబంధిత అధికారులను ఆయన ఆదేశించారు. కడప–దిగువపల్లె దారిలో జింకల వంకపై వంతెన నిర్మించాలని గ్రామస్థులు విన్నవించారు. తమ పొలాలకు రక్షణ గోడ నిర్మించాలని పెద్దపుత్త గ్రామస్థులు కోరారు. శ్మశానం నిర్మించాలని లేబాక వాసులు కోరారు. మండలంలోని తొమ్మిది సచివాలయాల్లోనూ అధికారులు తనిఖీలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జేసీ గణేష్ కుమార్, ట్రైనీ కలెక్టర్ మౌర్య భరద్వాజ్, ఆర్డీఓ ధర్మచంద్రారెడ్డి, అధికారులు సాయి ప్రత్యూష, ప్రభాకర్‌రెడ్డి, నాయకులు శివకుమార్ రెడ్డి, శంకర్‌రెడ్డి, బాలిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

బాల్య వివాహాలు నిర్మూలించాలి


ర్యాలీని ప్రారంభిస్తున్న ఐసీడీఎస్ పీడీ శ్రీలక్ష్మి, డిప్యూటీ కమిషనర్ రమణారెడ్డి

కడప కార్పొరేషన్: బాల్య వివాహాలను పూర్తిగా నిర్మూలించాలని ఐసీడీఎస్ ప్రాజెక్టు డైరెక్టర్ శ్రీలక్ష్మి కోరారు. కడప నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో కార్పొరేషన్ కార్యాలయం నుంచి భారీ ర్యాలీని ఆమెతోపాటు డిప్యూటీ కమిషనర్ రమణారెడ్డి జెండా ఊపి ప్రారంభించారు. ఎర్రముక్కపల్లె మీదుగా రాజీవ్ పార్కు వరకూ జరిగిన ర్యాలీలో కోలాటం, ఫ్లాష్ మ్యాప్ ద్వారా సిబ్బంది అవగాహన కల్పించారు. బాల్య వివాహాలపై స్టోరీ ప్రదర్శించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బాలికలకు 21 ఏళ్లు వచ్చిన తర్వాతే పెళ్లి చేయాలన్నారు. బాల్య వివాహాల నిరోధక చట్టాలపై అవగాహన కలిగి ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ నిత్యానందరెడ్డి, హిదయతుల్లా, సీఎంఎం.హరిప్రసాద్‌రెడ్డి, రెడ్డెమ్మ, సీవోలు, ఆర్పీలు పాల్గొన్నారు.

వేసవిని తలపిస్తున్న వేడిమి

నైరుతి రుతుపవనాల తిరోగమనం కారణంగా ఎండ తీవ్రత అకస్మాత్తుగా పెరిగిపోయింది. దీంతో భానుడు నిప్పులు కక్కుతున్నాడు. పెరిగిన ఉష్ణోగ్రతలకు తోడు ఉక్కపోత కారణంగా వాతావరణం వేసవిని తలపిస్తోంది.

- తీవ్ర ఉష్ణతాపంతో పెరిగిన ఉక్కపోత
- సాధారణం కంటే 3 నుంచి 5 డిగ్రీలు అధికం
- మెట్టప్రాంతాల్లోని బోరు బావుల్లో తగ్గిన నీరు



జిల్లాలో 2022, 2023లో 1-10 తేదీల మధ్య ఉష్ణోగ్రతల వివరాలివీ..

తేదీ (అక్టోబరు)	2023 కనిష్టం	2023 గరిష్టం	2022 కనిష్టం	2022 గరిష్టం
1న	25.2	34.7	22.1	26.2
2న	25.2	34.8	22.2	28.4
3న	24.4	32.6	24.2	30.2
4న	26.4	33.3	24.0	32.8
5న	26.3	33.3	23.5	29.7
6న	25.4	34.8	23.5	26.0
7న	23.3	36.3	23.9	26.2
8న	25.2	36.6	23.7	34.8
9న	25.9	37.0	23.9	32.1
10న	26.8	36.7	24.0	31.9
11న	25.2	36.2	23.8	30.5

కడప అగ్రికల్చర్: ఉదయం నుంచే భానుడు భగభగా మండిపోతుండడంతో ఎండ వేడిమి, ఉక్కపోతతో జనం ఇబ్బంది పడుతున్నారు. గత కొద్దిరోజులుగా తీవ్రమైన ఉక్కపోత, వేడితోపాటు కొన్ని ప్రాంతాల్లో పగటి ఉష్ణోగ్రత పెరిగింది. ఆకాశం మేఘావృతమై కన్పించినా వర్షాల జాడ మాత్రం లేదు. సాధారణంగా అక్టోబరులో ఎండలు తగ్గి వాతావరణం చల్లబడాలి. నేడు జిల్లాలో భిన్నంగా ఉంది. మధ్యాహ్నం వేడిగాలులు వీస్తున్నాయి. 10 రోజులుగా పగటి ఉష్ణోగ్రతలు సాధారణ ఉష్ణోగ్రత కంటే 3 నుంచి 5 డిగ్రీలు అధికంగా నమోదవుతోంది. రాత్రిళ్లు ఉక్కపోత తప్పడం లేదు. జనాలు ఏసీలు, ఫ్యాన్లతో ఉపశమనం పొందనిదే ఇళ్లలో ఉండలేకపోతున్నారు. మెట్టప్రాంతాల్లోని బోర్లలో నీటి లభ్యత తగ్గుతున్నట్లు రైతులు చెబుతున్నారు.

ఉష్ణోగ్రతదీ అదే దారి..

సాధారణంగా అక్టోబర్, నవంబర్ నెలల్లో తుపాన్లు వచ్చే అవకాశమున్నందున ఆ ప్రభావంతో వర్షాలు పడే అవకాశాలుండవచ్చు.. కానీ జిల్లాలో గరిష్టంతోపాటు కనిష్ట ఉష్ణోగ్రతలు పెరుగుతున్నాయి. గత పది రోజులుగా కనిష్ట ఉష్ణోగ్రతలు 25 డిగ్రీలకంటే అధికంగా ఉండగా గరిష్ట ఉష్ణోగ్రతలు 33 నుంచి 37 డిగ్రీల వరకు నమోదవుతున్నాయి. దీంతో జనాలు బెంబేలెత్తిపోతున్నారు. ఎండ వేడిమికి కొంతమంది వృద్ధులు గొడుగులు వాడుతుండగా మరితమంది వేసవి కాలం తరహాలో ఉదయం 10 గంటల తరువాత బయటకు రావడమే మానేస్తున్నారు. ఏసీలు, ఫ్యాన్ల వినియోగం పెరడంతో విద్యుత్తు బిల్లులు పెరిగాయని జనం ఆందోళన చెందుతున్నారు.

మాదిగలకు బీజేపీ ద్రోహం

ప్రొద్దుటూరు: అధికారంలోకి వచ్చిన వందరోజుల్లో ఎస్సీ వర్గీకరణ చేస్తామని చెప్పిన బీజేపీ ప్రభుత్వం మాదిగలకు ద్రోహం చేసిందని ఏపీ ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు దండు వీరయ్య మాదిగ తెలిపారు. స్థానిక ఆర్అండ్‌బీ గెస్ట్ హౌస్‌లో విలేకరులతో ఆయన మాట్లాడుతూ అధికారంలోకి వచ్చి పదేళ్లు పూర్తవుతున్నా ఎస్సీ వర్గీకరణ బిల్లుపై పార్లమెంట్‌లో చర్చకు పెట్టలేదని విమర్శించారు. రాజకీయ పార్టీల మేనిఫెస్టోలకు మోసపోవద్దని తెలిపారు. కర్నూలులో ఈ నెల 18న జరిగే ఏపీ ఎమ్మార్పీఎస్ సభ నుంచి మహా సంగ్రామానికి మాదిగలు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. సమావేశంలో నాగభూషణం మాదిగ, సాకె బాలలక్ష్మయ్య మాదిగ, వెంకటనారాయణ మాదిగ, చెన్నమ్మ మాదిగ, తిరుమలయ్య మాదిగ, సహదేవుడు మాదిగ, ఈశ్వరయ్య మాదిగ పాల్గొన్నారు.

పండ్లతోటల పరిశీలన

వల్లూరు: ఉపాధి హామీ పథకం కింద పండ్ల తోటలు సాగుచేసుకున్న రైతులకు ఎప్పటికప్పుడు సొమ్ము చెల్లింపు పూర్తిచేయాలని డ్వామా పీడీ యదుభూషణ్ రెడ్డి ఆదేశించారు. కొత్త గాలివారిపల్లెలో రైతులు సాగు చేసిన చీనీ తోటలను బుధవారం ఆయన పరిశీలించారు. నిర్వహణ బిల్లులు సకాలంలో అందుతున్నాయా అని ఆరా తీశారు. ఈ కార్యక్రమంలో ఏపీడీ సోమ శేఖర్‌రెడ్డి, ఏపీవోలు సుధారాణి, పార్థ సారధి, ఈసీ అంజలి పాల్గొన్నారు.

ఆసుపత్రిని పరిశీలించిన ట్రైనీ కలెక్టర్


ప్రభుత్వ ఆసుపత్రిని పరిశీలిస్తున్న ట్రైనీ కలెక్టర్ మౌర్య భరద్వాజ్

జమ్మలమడుగు రూరల్ : వైఎస్సార్ జిల్లా ట్రైనీ కలెక్టర్ మౌర్య భరద్వాజ్ పట్టణంలోని ప్రభుత్వ ఆసుపత్రిని బుధవారం సందర్శించి పరిసరాలను పరిశీలించారు. అనంతరం ఆసుపత్రిలో అందుతున్న సేవల గురించి రోగులను అడిగి తెలుసుకున్నారు. ఆసుపత్రి సూపరింటెండెంట్ రఫీక్ పాషాను ఆసుపత్రిలో ఎంత మంది డాక్టర్లు, సిబ్బంది ఉన్నారు, కేసుల వివరాలను అడిగి తెలుసుకున్నారు.

రేషన్ బియ్యం పట్టివేత

కొండాపురం : మండల పరిధిలోని బురుజుపల్లె, కొట్టాలపల్లె గ్రామాల మధ్య ఆటోలో అక్రమంగా రేషన్ బియ్యం తరలిస్తుండగా సీజ్ చేసినట్లు తాళ్లప్రొద్దుటూరు ఎస్ఐ ఆర్. మోహన్ తెలిపారు. 920 కేజీల రేషన్ బియ్యంతో పాటు ఆటోను సీజ్ చేసి కేసు నమోదు చేశామన్నారు.

కాలిన గాయాలతో వృద్ధురాలి మృతి


వెంకటసుబ్బమ్మ (ఫైల్)

ఒంటిమిట్ట(సిద్దవటం) : మండలంలోని కొండమాచుపల్లె గ్రామానికి చెందిన చేపూరి వెంకటసుబ్బమ్మ (61) అనే వృద్ధురాలు చీరకు మంటలు అంటుకోవడంతో కడప రిమ్స్‌లో చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందినట్లు ఎస్ఐ మధుసూదన్‌రావు తెలిపారు. వెంకటసుబ్బమ్మ ఈనెల 6వ తేదీన గ్యాస్ స్టౌవ్ మీద నీళ్లు కాచుకునేందుకు స్టౌవ్ వెలిగించిందన్నారు. ప్రమాద వశాత్తు మంటలు ఆమె చీరకు అంటుకోవడంతో ఇంట్లోనుంచి బయటకు కేకలు వేస్తూ వచ్చిందన్నారు. బయట ఉన్న ఆమె కుమారుడు యానాదయ్య మంటలను ఆర్పేందుకు ఆమెపై నీళ్లు పోశారన్నారు. ఆమెకు గాయాలు ఎక్కువ కావడంతో కడప రిమ్స్‌లో చేర్పించారని తెలిపారు. అక్కడ వైద్యం పొందుతూ బుధవారం ఉదయం మృతి చెందిందని వివరించారు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

ప్రొద్దుటూరు ప్రభుత్వ ఆసుపత్రిలో..


మృతి చెందిన వృద్ధురాలు

ప్రొద్దుటూరు క్రైం : స్థానిక జిల్లా ప్రభుత్వ ఆస్పత్రిలో నాగమల్లమ్మ (63) అనే వృద్ధురాలు అనారోగ్యంతో బుధవారం మృతి చెందింది. మైదుకూరు రహదారి పక్కన పడిపోయిన ఆమెను 108 అంబులెన్స్ సిబ్బంది జిల్లా ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతున్న ఆమె సాయంత్రం మృతి చెందింది. ఆమె వద్ద ఉన్న ఆధార్ కార్డు ఆధారంగా చాపాడు మండలం ద్వారకానగర్‌కు చెందిన నాగమల్లమ్మగా గుర్తించారు. మృతదేహాన్ని మార్చురీలో భద్రపరిచారు. మృతురాలి బంధువులు ఔట్‌పోస్టులో సంప్రదించాలని మార్చురీ ఇన్‌చార్జి తేజా తెలిపారు.

రాణించిన కడప బ్యాట్స్‌మన్


కేఓఆర్ఎం మైదానంలో తలపడుతున్న నెల్లూరు, అనంతపురం జట్లు


జాఫర్‌అలీ, కడప (60 పరుగులు)


ఆదిల్ హుస్సేన్, కడప 63 పరుగుల


మల్లికార్జున, అనంతపురం (4 వికెట్లు)

కడప స్పోర్ట్స్ : ఏసీఏ అండర్-23 అంతర్ జిల్లాల మల్టీడేస్ క్రికెట్ టోర్నమెంట్ ఉత్సాహంగా సాగుతోంది. కడప నగరంలోని కేఎస్‌ఆర్ఎం మైదానంలో బుధవారం కడప, కర్నూలు జట్లు తలపడ్డాయి. టాస్ గెలిచిన కడప జట్టు బ్యాటింగ్ ఎంచుకుంది. తొలిరోజు ఆట ముగిసే సమయానికి 90 ఓవర్లలో 8 వికెట్ల నష్టానికి 244 పరుగులు చేసింది. జట్టులోని జాఫర్‌అలీఖాన్ 60 పరుగులు, ఆదిల్‌హుస్సేన్ 63 పరుగులతో క్రీజులో ఉన్నారు. కర్నూలు సాబ్జాన్ బాషా 4 వికెట్లు తీశాడు. దీంతో తొలిరోజు ఆట ముగిసింది.

కేఓఆర్ఎం మైదానంలో..

కేఓఆర్ఎం మైదానంలో నిర్వహించిన మరో మ్యాచ్‌లో నెల్లూరు, అనంతపురం జట్లు తలపడ్డాయి. టాస్ గెలిచిన నెల్లూరు జట్టు 65.4 ఓవర్లలో 200 పరుగుల వద్ద ఆలౌట్ అయింది. జట్టులోని ఫర్హాద్‌ఖాద్రి 40, సుబ్రమణ్యం 40 పరుగులు చేశారు. అనంతపురం బౌలర్లు మల్లికార్జున, లోహిత్‌సాయికిశోర్ 2, ప్రదీప్‌రెడ్డి 2 వికెట్లు తీశారు. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన అనంతపురం జట్టు తొలిరోజు ఆట ముగిసే సమయానికి 24 ఓవర్లలో 3 వికెట్ల నష్టానికి 78 పరుగులు చేసింది. జట్టులోని యోగానంద 37 పరుగులు చేశాడు. నెల్లూరు బౌలర్ అఖిల్ 2 వికెట్లు తీశాడు. దీంతో తొలిరోజు ఆట ముగిసింది.

అసాంఘిక కార్యకలాపాలను నిర్మూలించాలి

ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి


మాట్లాడుతున్న ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి

ప్రొద్దుటూరు : రానున్న మూడు నెలల కాలంలో ప్రొద్దుటూరులో అసాంఘిక కార్యకలాపాలను పూర్తిగా నిర్మూలించాలని ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి జిల్లా పోలీసు యంత్రాంగాన్ని కోరారు. స్థానిక మున్సిపల్ చైర్‌పర్సన్ ఛాంబర్‌లో బుధవారం ఎమ్మెల్యే విలేకరులతో మాట్లాడుతూ మట్కా, గుట్కా, బెట్టింగ్, ఇసుక అక్రమ రవాణా, వ్యభిచారం లాంటి అసాంఘిక కార్యకలాపాలను మూడు నెలల్లో పూర్తిగా నిర్మూలించాలని, లేకుంటే తానే ఉద్యమిస్తానని అన్నారు. ప్రొద్దుటూరులోనే బెట్టింగ్ ఉన్నట్లు దానిని తాను ప్రోత్సహిస్తున్నట్లు మాజీ ఎమ్మెల్యే వరదరాజులరెడ్డి ఆరోపించారన్నారు. పోలీసు రికార్డుల్లో 2007 నుంచే ఇక్కడ బెట్టింగ్ కేసులు నమోదైనట్లు ఆధారాలు ఉన్నాయని తెలిపారు. ప్రస్తుతం ఉన్న బెట్టింగ్ నిర్వాహకుల్లో 90 శాతం మంది వరద వెంట గతంలో నడిచిన వారేనన్నారు. బెట్టింగ్ నిర్వాహకుడు ఖాదర్‌బాద్ నరసింహాకు చెందిన రూ.8 కోట్ల నగదును సీజ్ చేస్తే వరద డీజీపీ వరకు వెళ్లిన విషయం వాస్తవం కాదా అని ప్రశ్నించారు. పాతికేళ్లపాటు ఎమ్మెల్యేగా ఉన్నప్పుడు వరద ఎందుకు అసాంఘిక కార్యక్రమాలను నిర్మూలించలేకపోయారన్నారు. కేవలం టీడీపీ టికెట్ రేసులో ముందు వరుసలో ఉండేందుకే ఉద్దేశ పూర్వకంగా వరదరాజుల రెడ్డి, టీడీపీ ఇన్‌చార్జి ప్రవీణ్‌కుమార్‌రెడ్డి తనను విమర్శిస్తున్నారన్నారు. తాను చేసే సహాయ కార్యక్రమాలతోపాటు చివరికి రాజన్న భోజనం కూడా క్రికెట్ బుకీల డబ్బుతోనే నిర్వహిస్తున్నాని విమర్శించడాన్ని తీవ్రంగా ఖండించారు. సమావేశంలో మున్సిపల్ చైర్‌పర్సన్ భీమునిపల్లి లక్ష్మీదేవి, వైస్ చైర్మన్ ఖాజామొహిద్దీన్, ఎంపీపీ శేఖర్ యాదవ్, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అదనపు కార్యదర్శి పోరెడ్డి నరసింహారెడ్డి, జేసీఎస్ జిల్లా కోఆర్డినేటర్ కల్లూరు నాగేంద్రారెడ్డి, వైఎస్సార్‌సీపీ పట్టణాధ్యక్షులు కామిశెట్టి బాబు, కోనేటి సునంద, ఆర్‌పీసీఏ మెంబర్ కాకర్ల నాగశేషారెడ్డి, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

నకిలీ కమిషనర్ అరెస్టు

- జల్సాలకు అలవాటు పడి.. సైబర్ నేరస్తుడిగా మారి..
- చివరకు పోలీసులకు చిక్కిన వైనం

గుంతకల్లు : ట్రేడ్ లైసెన్స్‌ల రెన్యూవల్ పేరిట వసూళ్లు చేస్తున్న నకిలీ మున్సిపల్ కమిషనర్‌ను గుంతకల్లు పోలీసులు అరెస్టు చేశారు. ఇటీవల తాను గుంతకల్లు మున్సిపల్ కమిషనర్‌ను అంటూ ఓ సైబర్ నేరగాడు పట్టణంలోని కొంతమంది షాపు ఓనర్లను భయపెట్టి ఫోన్‌పే ద్వారా రూ.1000 చొప్పున వసూలు చేస్తున్న విషయం సోషల్ మీడియాలో వైరల్ అయ్యింది. ఈ విషయమై మున్సిపల్ కమిషనర్ మల్లికార్జున ఓ ప్రకటన విడుదల చేస్తూ అపరిచిత వ్యక్తుల ఫోన్లు వస్తే స్పందించకుండా కార్యాలయంలో సంప్రదించాలని సూచించారు. ఎస్పీ అన్బురాజన్ ఆదేశాల మేరకు గుంతకల్లు డీఎస్పీ నరసింగప్ప, టూటౌన్ సీఐ గణేష్ నకిలీ మున్సిపల్ కమిషనర్ కోసం గాలింపు చేపట్టారు. బుధవారం ఈ సైబర్ నేరగాడు స్థానిక టీవీ స్టేషన్ వద్ద అనుమానాస్పదంగా తిరుగుతూ పోలీసులకు చిక్కాడు. ఇందుకు సంబంధించిన వివరాలను పట్టణంలోని టూటౌన్ పోలీసు స్టేషన్‌లో డీఎస్పీ మీడియాకు వెల్లడించారు. సైబర్ నేరగాడు వైఎస్సార్ జిల్లా బి.కోడూరు మండలం రామచంద్రాపురం గ్రామానికి చెందిన బిల్లా నాగేశ్వరరావుగా గుర్తించామన్నారు. కోర్టులో హాజరుపరుస్తున్నామన్నారు.

జల్సాల కోసమే సైబర్ నేరాలు..

బిల్లా నాగేశ్వరరావు ప్రైవేటు ఉద్యోగి. ఇతడు జల్సాలకు అలవాటు పడ్డాడు. భార్యకు విడాకులిచ్చి.. తల్లిదండ్రులతో కలిసి ఉంటున్నాడు. జల్సాలకు అవసరమైన డబ్బును సమకూర్చుకునేందుకు సైబర్ నేరాలకు పాల్పడుతూ వస్తున్నాడు. ఈ క్రమంలో తన పేరు జశ్వంత్‌రెడ్డి అ లియాస్ సురేంద్రరెడ్డి పేర్లతో చలామణి అవుతున్నాడు. ఇతనిపై వైఎస్సార్ జిల్లాలో కూడా కేసులు నమోదయ్యాయి.

ఏఎఫ్‌యూలో సెమిస్టర్ పరీక్షా ఫలితాల విడుదల


పరీక్షా ఫలితాలను విడుదల చేస్తున్న వీసీ ఆచార్య బి. అంజనేయప్రసాద్, అధికారులు

ఏఎఫ్‌యూ : కడప నగరంలోని డాక్టర్ వైఎస్ఆర్ ఆర్కిటెక్చర్ అండ్ ఫైన్‌ఆర్ట్స్ విశ్వవిద్యాలయంలో స్కూల్ ఆఫ్ ప్లానింగ్‌లోని ఎం.ప్లాన్ (యూఆర్‌పీ) విభాగానికి సంబంధించిన 4వ సెమిస్టర్ రెగ్యులర్ పరీక్షా ఫలితాలు విడుదలయ్యాయి. బుధవారం విశ్వవిద్యాలయంలో వైస్ చాన్సలర్ ఆచార్య బి. అంజనేయప్రసాద్ ఫలితాలను స్క్రీన్‌పై విడుదల చేశారు. ఈ సందర్భంగా వీసీ మాట్లాడుతూ పరీక్షా ఫలితాల్లో 100 శాతం ఉత్తీర్ణత రావడం అభినందనీయమన్నారు. పరీక్షా ఫలితాలు విశ్వవిద్యాలయ వెబ్‌సైట్‌లో ఉంచినట్లు తెలిపారు. కార్యక్రమంలో డిప్యూటీ రిజిస్ట్రార్ రాజేష్‌కుమార్‌రెడ్డి, సూపరింటెండెంట్ వై. పవన్‌కుమార్‌రెడ్డి, అదనపు పరీక్షల నియంత్రణాధికారి డాక్టర్ ఇ.సి. సుప్రియ, ఉదయప్రకాష్‌రెడ్డి పాల్గొన్నారు.

మృత్యువుతో పోరాడి..ఓడి!

- గణేష్ నిమజ్జనం ఊరేగింపులో దుర్ఘటన
- 20 రోజుల అనంతరం మృత్యు ఒడికి చేరిన యువకుడు


కిరణ్(ఫైల్)


వినాయక నిమజ్జనం ర్యాలీలో పల్టీ కొట్టి పడిపోయిన కిరణ్(ఫైల్)

రాజంపేట : వినాయక నిమజ్జనం సందర్భంగా ట్రాక్టర్ పైనుంచి పల్టీ కొట్టి ప్రాణాలమీదకు తెచ్చుకున్న యువకుడు 20 రోజుల పాటు మృత్యువుతో పోరాడి చివరకు తనువు చాలించాడు. ఈ విషాద సంఘటన రాజంపేట పట్టణంలో చోటుచేసుకుంది. పట్టణంలోని మన్నూరుకు చెందిన కిరణ్ (30) గతనెల 22న గణేష్ నిమజ్జనంలో ఉత్సాహంగా ట్రాక్టర్‌పై నుంచి విన్యా సం చేసి చివరికి ప్రాణాల మీదకు తెచ్చుకున్న సంఘటన సర్వత్రా చర్చనీయాంశంగా మారింది. వినాయక చవితి ఉత్సవాల్లో భాగంగా తమ ప్రాంత వినాయకుని నిమజ్జనం ర్యాలీ భారీగా వాయిద్యాలు, బాణసంచాలను కాలుస్తూ పట్టణంలోని పాత బస్టాండుకు చేరుకుంది. ఈ క్రమంలో కిరణ్ ఉన్నఫలంగా ట్రాక్టర్ ఇంజిన్‌పై నుంచి పల్టీ కొట్టేందుకు ప్రయత్నించే క్రమంలో అదుపుతప్పి పడ్డాడు. దీంతో మెడ, తలకు తీవ్ర గాయాలయ్యాయి. చికిత్స నిమిత్తం తిరుపతిలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. నరాలు దెబ్బతినడంతో లాభం లేదని ఇంటికి తీసుకొచ్చారు. అప్పటి నుంచి 20రోజుల పాటు మృత్యువుతో పోరాడాడు. పరిస్థితి విషమించడంతో కుటుంబ సభ్యులు చికిత్స చేయించినా ఫలితం లేకుండా పోయింది. మృతుడికి అమ్మానాన్నతో పాటు అన్న ఉన్నాడు.

విషపూరిత నీళ్లు తాగి మేకలు మృతి


మృతి చెందిన మేకలు

రాజంపేట : మండలంలోని ఊటుకూరు గ్రామ పరిధి కొండమిట్టలో విషపూరిత నీళ్లు తాగి తొమ్మిది మేకలు మృతి చెందిన సంఘటన బుధవారం చోటుచేసుకుంది. షేక్‌చాంద్‌బాషా, పొన్న గంటి లక్ష్మీదేవిలు దినసరిలో భాగంగా జీవాలను కొండమిట్టకు తోలుకెళ్లారు. అక్కడ నీటి గుంటలోని నీళ్లను మేకలు తాగాయి. అయితే అందులో గుర్తుతెలియని వ్యక్తులు రోగర్‌ను కలిపినందు వల్లనే ఆ నీటిని తాగి మృతి చెందాయనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఈ విషయమై స్థానిక తహసీల్దార్‌కు ఫిర్యాదు చేశారు. వీఆర్వో బాషా సంఘటన స్థలానికి చేరుకున్నారు. మృతి చెందిన మేకల విలువ రూ.లక్ష ఉంటుందని అంచనా వేశారు. బాధితుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

కౌన్సెలింగ్‌లో బ్రాంచులు మార్చిన నిందితుల అరెస్టు

రాజంపేట రూరల్ : అనధికారంగా ఓటీపీ నంబర్‌లను సేకరించి ఏపీ ఎంసెట్ కౌన్సెలింగ్‌లలో బ్రాంచ్‌లను మార్చిన వారిని అరెస్టు చేసినట్లు డీఎస్పీ వీఎన్‌కే చైతన్య తెలిపారు. స్థానిక రూరల్ పోలీస్ స్టేషన్‌లో బుధవారం రూరల్ సీఐ కె.పుల్లయ్య, ఎస్ఐ ఎం.భక్తవత్సలంతో కలిసి ఆయన విలేకరులతో మాట్లాడారు. ఏఐటీఎస్ విద్యార్థి తలారి హేమంత్ కుమార్ తనకు ఎంసెట్ మొదటి కౌన్సెలింగ్‌లో వచ్చిన ఈసీఈ బ్రాంచ్‌ను గుర్తు తెలియని వ్యక్తులు రెండవ విడత కౌన్సెలింగ్‌లో ఈఈఈ బ్రాంచ్‌గా మార్చినట్లు ఫిర్యాదు చేశాడన్నారు. ఓటీపీలను సేకరించి బ్రాంచ్‌లను మార్చి అవకతవకలకు పాల్పడిన ముగ్గురిని అరెస్టు చేసినట్లు డీఎస్పీ తెలిపారు. ఎంసెట్ కౌన్సెలింగ్ విషయంలో తెలిసిన అధ్యాపకులు, కాలేజీలను సంప్రదించి దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

వైవీయూతో పోరుమామిళ్ల జీడీసీ ఎంఓయూ


ఒప్పంద పత్రాలను మార్చుకుంటున్న వైవీయూ అధికారులు, పోరుమామిళ్ల అధ్యాపకులు

వైవీయూ : యోగివేమన విశ్వవిద్యాలయం, పోరుమామిళ్ల ప్రభుత్వ డిగ్రీ కళాశాల మధ్య విద్య, పరిశోధన కార్యకలాపాలకు సంబంధించిన పరస్పర సహకారం కోసం అవగాహన ఒప్పందం కుదిరింది. వైస్ చాన్సలర్ ఆచార్య చింతా సుధాకర్, రిజిస్ట్రార్ ఆచార్య వై.పి. వెంకటసుబ్బయ్య, ప్రిన్సిపాల్ ఆచార్య ఎస్. రఘునాథరెడ్డి, భౌతికశాస్త్ర విభాగాధిపతి ఆచార్య కె. కృష్ణారెడ్డి, పోరుమామిళ్ల భౌతికశాస్త్ర విభాగాధిపతి డాక్టర్ వెంకట్రావు ఒప్పంద పత్రాలపై బుధవారం సంతకాలు చేశారు. కార్యక్రమంలో భౌతికశాస్త్ర అధ్యాపకులు డాక్టర్ వి. వెంకట్రాము, డాక్టర్ రాఘవేందర్ పాల్గొన్నారు.

వైవీయూకు విద్యాశాఖ మంత్రి అభినందన

యోగివేమన విశ్వవిద్యాలయానికి న్యాక్ ఏ గ్రేడ్ లభించడం పట్ల రాష్ట్ర విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ అభినందించారు. మంగళవారం విజయవాడలో ఏపీ ఉన్నతవిద్యామండలి ఆధ్వర్యంలో నిర్వహించిన అభినందన కార్యక్రమంలో వైవీయూ వీసీ ఆచార్య చింతా సుధాకర్, ఐక్యూఏసీ సంచాలకులు డాక్టర్ లోకా సుబ్రమణ్యశర్మలను సత్కరించి జ్ఞాపిక అందజేశారు.

వైవీయూలో డిగ్రీ హానర్స్ ప్రారంభం


సమావేశంలో మాట్లాడుతున్న వీసీ ఆచార్య చింతా సుధాకర్

వైవీయూ : యోగివేమన విశ్వవిద్యాలయంలో 2023-24 విద్యాసంవత్సరం నుంచి డిగ్రీ హానర్స్ ప్రారంభిస్తున్నట్లు వైవీయూ వైస్ చాన్సలర్ ఆచార్య చింతా సుధాకర్ తెలిపారు. బుధవారం ఏపీ ఉన్నత విద్యామండలి చైర్మన్ ఆచార్య కె. హేమచంద్రారెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన వర్చువల్ సమావేశంలో వైవీయూ వీసీ, ఇతర అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వీసీ మాట్లాడుతూ నూతన జాతీయ విద్యావిధానాన్ని అనుసరించి రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు ఈ యేడాది నుంచి డిగ్రీ మూడో సంవత్సరం పూర్తయిన విద్యార్థులకు నాల్గవ యేడాది డిగ్రీ హానర్స్ చేసేందుకు అవకాశం కల్పించినట్లు తెలిపారు. డిగ్రీ హానర్స్ పూర్తి చేసుకునే విద్యార్థులు నేరుగా పీజీ రెండో సంవత్సరంలో ప్రవేశం పొందవచ్చన్నారు. అదే విధంగా రీసెర్చ్ కామన్ ఎంట్రన్స్ టెస్ట్ ద్వారా పీహెచ్‌డీలో సైతం ప్రవేశం పొందవచ్చని తెలిపారు. విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో పరీక్షల నియంత్రణాధికారి ఆచార్య ఎన్. ఈశ్వరరెడ్డి, ప్రవేశాల సంచాలకులు ఆచార్య కె. గంగయ్య, సీడీసీ డీన్ ఆచార్య రఘుబాబు, డిప్యూటీ డైరెక్టర్ టి. లక్ష్మీప్రసాద్ పాల్గొన్నారు.

వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ఐదుగురికి గాయాలు


గాయపడిన ఇంటర్ విద్యార్థి భవానీప్రసాద్

మదనపల్లె : వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ఐదుగురు గాయపడి స్థానిక ప్రభుత్వ జిల్లా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. మదనపల్లె మండలం కత్తివారిపల్లె పంచాయతీకి చెందిన శ్రీనివాసులు (24), ఇంటర్మీడియట్ విద్యార్థి భవానీప్రసాద్ (17) ద్విచక్ర వాహనంలో మదనపల్లెకు వస్తుండగా మార్గమధ్యంలో టేకుల పాళెం వద్ద ఎదురుగా వచ్చిన కారు ద్విచక్రవాహనాన్ని ఢీకొంది. ఈ ప్రమాదంలో భవానీప్రసాద్, శ్రీనివాసులు గాయపడగా స్థానికులు ప్రభుత్వ జిల్లా ఆస్పత్రికి తరలించారు. తాలూకా పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు. అదే విధంగా కురబలకోట మండలం ఎర్రమద్దివారిపల్లెకు చెందిన మణికంఠ(36) తన కుమారుడు ధనుష్(15),కుమార్తె సంధ్య(8)తో కలిసి ద్విచక్రవాహనంలో ముదివేడుకు వచ్చి తిరిగి ఎర్రమద్దివారిపల్లెకు వెళుతుండగా గ్రామ సమీపంలో ఎదురుగా వచ్చిన మరో ద్విచక్రవాహనం వీరి వాహనాన్ని ఢీకొంది. ప్రమాదంలో మణికంఠ, సంధ్య తీవ్రంగా గాయపడగా, ధనుష్‌కు స్వల్ప గాయాలయ్యాయి. స్థానికులు బాధితులను 108 వాహనంలో మదనపల్లె జిల్లా ఆస్పత్రికి తరలించారు. ముదివేడు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

రోడ్డు ప్రమాదంలో మహిళ మృతి


రోడ్డు ప్రమాదంలో మృతిచెందిన రామాంజులమ్మ

పెద్దమండ్యం : పెద్దమండ్యం- గుర్రంకొండ రహదారిపై బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒక మహిళ మృతి చెందింది. ఎస్ఐ రామాంజనేయుడు కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. పెద్దమండ్యం గ్రామం పాతూరుకు చెందిన రెబ్బ చిన్నరవనప్ప వ్యవసాయం చేసుకుని జీవనం సాగించేవాడు. తొమ్మిది సంవత్సరాల క్రితం పెద్దమండ్యం నుండి వెళ్లి మదనపల్లె రూరల్ మండలం జగనన్న కాలనీ, అమ్మచెరువు మిట్టలో భార్య రామాంజులమ్మ (50)తో కలిసి కాపురం ఉంటున్నారు. భార్య రామాంజులమ్మ పెద్దమండ్యంలో ధనలక్ష్మి స్వయం సహాయక సంఘంలో సభ్యురాలిగా ఉంది. బ్యాంక్ ద్వారా సంఘం సభ్యులు తీసుకున్న రుణం తీరిపోవడంతో కొత్తగా సంఘానికి రుణ సహాయం చేస్తున్నట్లు సభ్యులు తెలిపారు. ఈ విషయమై భర్తతో కలిసి ద్విచక్రవాహనంలో మంగళవారం పెద్దమండ్యంకు వచ్చింది. బ్యాంక్‌లో పని చూసుకుని రాత్రి పెద్దమండ్యంలోని బంధువుల ఇంటిలో ఉండి, బుధవారం మదనపల్లెకు ద్విచక్రవాహనంలో బయలుదేరారు. మార్గమధ్యంలో వడ్డిపల్లె వద్ద ద్విచక్రవాహనం నుండి కింద పడిపోయింది. అదే సమయానికి గాలివీడు వైపు వస్తున్న మదనపల్లె 2 డిపో బస్సు రామాంజులమ్మ తలపై వెళ్లడంతో తల పగిలిపోయి అక్కడికక్కడే మృతి చెందింది.